

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

పీహెచ్‌సీని పరిశీలించిన కార్పొరేటర్

బంజారాహిల్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని షౌకత్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం వెంకటేశ్వరనగర్‌కాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి సందర్శించారు. కేంద్రంలో వసతులపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్, నర్సులు లేనట్లు గుర్తించారు. వెంటనే ఎస్పీహెచ్‌ఓ విజయనిర్మలకు ఫోన్ చేసి వైద్యులను అపాయింట్ చేయాలని సూచించారు. మందుల కొరతపై సైతం దృష్టి సారించాలని కోరారు.



విజేతలతో పాఠశాల డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

మెగా కాంపిటీషన్‌లో ఏహెచ్‌పీఎస్ విద్యార్థుల ప్రతిభ

అమీర్‌పేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రామయ్యనగర్‌లోని ఏహెచ్‌పీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు గత నెల 30న ఢిల్లీలో జరిగిన మెగా కాంపిటీషన్‌లో ప్రతిభ చూపారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం తదితర పోటీల్లో బహుమతులను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఆలూరి లక్ష్మి విజేతలకు మెడల్స్ అందజేసి అభినందించారు.



విజేత జట్టు

ఎస్ఎఫ్ఏ కబడ్డీ విజేతగా విజ్ఞాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): స్పోర్ట్స్ ఫర్ ఆల్ (ఎస్ఎఫ్ఏ) క్రీడా పోటీల్లో బాలుర కబడ్డీలో విజ్ఞాన్స్ ట్రీ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో బాలుర అండర్-14 ఫైనల్లో రెయిన్‌బో స్కూల్ (చింతల్)పై విజ్ఞాన్స్ ట్రీ స్కూల్ జట్టు (నిజాంపేట) గెలిచింది. బాలికల అండర్-14 కబడ్డీ ఫైనల్లో కేంద్రీయ విద్యాలయ (గచ్చిబౌలి) జట్టు స్వర్ణం దక్కించుకుంది. అండర్-16 బాలికల వాలీబాల్ టైటిల్‌ను శేరిలింగంపల్లి కార్నర్ స్టోన్ స్కూల్ గెలుచుకుంది. ఖాజాగూడలోని డీపీఎస్ జట్టు ఫుట్‌బాల్ చాంపియన్‌గా నిలిచింది. ఎస్ఎఫ్ఏ పోటీలు మరో రెండు రోజుల పాటు జరగనున్నాయి.

మంత్రాల పేరుతో మాయ

- రూ.లక్షలు దోచుకుంటున్న మాయగాళ్లు
- రోగాలు నయం చేస్తామని కొందరు
- దిష్టి పేరుతో మరికొందరు
- బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుల వెల్లువ



బంజారాహిల్స్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరికీ అనారోగ్య సమస్యలు తలెత్తకుండా మంత్రశక్తితో పూజలు చేస్తానని ఓ వ్యక్తి చెప్పడంతో వృద్ధురాలు రూ.లక్ష ఇచ్చింది. చెప్పినట్టుగానే హోమం నిర్వహించాడు. ఆ తర్వాత ఆమెకు అనేక అనుమానాలు కలిగేలా మాటలు చెబుతూ పూజలు పేరిట రూ.20 లక్షలు వసూలు చేశాడు. విషయం ఆమె కుటుంబ సభ్యులకు తెలియడంతో తమ ఇంటికి రావొద్దని అతడిని హెచ్చరించారు. దీంతో ఆగ్రహానికి లోనైన మంత్రగాడు మీ కాళ్లు చేతులు పనిచేయకుండా పూజలు చేస్తానంటూ బెదిరింపులకు దిగడంతో వారు బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. మరో ఘటనలో.. బంజారాహిల్స్‌లో నివసించే ఓ మహిళ ప్రీ స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. ఆమె వద్దకు ఇద్దరు మహిళలు వచ్చి ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి చందా కావాలని అడగడంతో కొంత నగదు ఇచ్చింది. అయితే వారు ఆమెతో మాటలు కలిపి ఇంటికి దిష్టి తగిలిందని, పూజలు చేయాలని చెప్పి రూ.లక్షతో ఉడాయించారు. ఈ తరహా ఫిర్యాదులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో పెరుగుతున్నాయి. ప్రజల నమ్మకాలు, ఆశలను క్యాష్ చేసుకునేందుకు కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి ప్రత్యేక గ్యాంగ్‌లు దిగుతున్నాయి. రైస్‌పుల్లింగ్, మంత్రాలు, బ్లాక్ మ్యాజిక్ పేరుతో నేరగాళ్లు మాయ చేసి దోచుకుంటున్నారు. అయితే ఈ తరహాలో మోసపోయే వారిలో విద్యావంతులే అధికంగా ఉంటుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

వెలుగులోకి రైస్ పుల్లింగ్..

నగరంలో జరుగుతున్న మోసాల్లో రైస్ పుల్లింగ్ ఈ మధ్య వెలుగులోకి వచ్చింది. పంచలోహాలతో తయారు చేసిన ఓ పాత్రకు డబ్బులను ఆకర్షించే శక్తి ఉందంటూ కొందరు ముఠా సభ్యులు అమాయకులకు వల వేసి లక్షలాది రూపాయలు తీసుకొని వాటిని అంటగడుతున్నారు. పంచలోహాలతో తయారు చేసిన పాత్రను బియ్యంలో ఉంచితే సహజంగా అవి కదులుతూ ఉంటాయి. పాత్ర చుట్టు చేరుతాయి. ఈ ఆకర్షణ శక్తే మోసగాళ్లకు పెట్టుబడిగా మారింది. బియ్యంను ఆకర్షించినట్టే డబ్బును కూడా పాత్ర ఆకర్షిస్తుందని నమ్మబలుకుతున్నారు. అంతే కాదు మ్యాజిక్‌తో డెమో ప్రదర్శన ఇస్తారు. దీంతో నమ్మి డబ్బులు చెల్లిస్తున్నారు. అనారోగ్యం నుంచి కోలుకునేందుకు పాతబస్తీకి చెందిన అనేక మంది మంత్రగాళ్లను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న టోలిచౌకికి చెందిన అహ్మద్ ముగ్గురు మహిళలను ఏమార్చి సుమారు కిలోన్నర బంగారం తీసుకున్నాడు. రోగం తగ్గకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అతడిని అరెస్టు చేశారు. పాతబస్తీకి చెందిన సయ్యద్ మంత్రించిన నీటి పేరిట స్థానికులను దోచుకుని అరెస్టు అయ్యాడు.

జాగ్రత్తగా ఉండాలి



మంత్రాలు, పూజల పేరుతో అనేక మంది మోసగాళ్లు వస్తుంటారు. అలాంటి వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. దిష్టి తాకిందని, రోగాలు నయం చేస్తామని చెబితే నమ్మవద్దు. అనుమానం వస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మోసాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెడుతున్నాం.

- సామల వెంకట్‌రెడ్డి, ఏసీపీ, బంజారాహిల్స్



జవహర్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న మట్టికుప్పలు

మట్టికుప్పలు తొలగించండి

బోరబండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు సంబంధిత అధికారికి ఫోన్ చేయగా జవహర్‌నగర్, వీడియో గల్లీ, రహ్మత్‌నగర్ గల్లీ రోడ్డులో నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అయితే వ్యర్థాలను తొలగించి వారం రోజులు కావస్తున్నా మట్టికుప్పలను తొలగించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండిపోయిన మట్టి తిరిగి నాలాలోకి వెళ్తోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మట్టికుప్పలను తొలగించాలని కోరుతున్నారు.

మసీద్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఖాద్రి



నసీరుద్దీన్ ఖాద్రి

అమీర్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం జరిగిన బల్కంపేట మసీద్ బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో సీనియర్ పాత్రికేయుడు నసీరుద్దీన్ ఖాద్రి రెండవసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో గెలిపించిన స్థానికులకు ఈ సందర్భంగా ఖాద్రి కృతజ్ఞతలు తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెరగాలి

- బసవతారకం ఆస్పత్రి ట్రస్టు సభ్యుడు జేఎస్ఆర్ ప్రసాద్



వీ ఫర్ ఉమెన్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ట్రస్టు సభ్యుడు జేఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకొని బంజారాహిల్స్‌లోని ఆసుపత్రి ప్రాంగణంలో అవగాహన నడకను ఆదివారం ఆయన సినీ నటులు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు మెరుగైన క్యాన్సర్ వైద్యం అందించాలనే లక్ష్యంతో నందమూరి తారక రామారావు ఆస్పత్రి స్థాపనకు పూనుకున్నారన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై యుద్ధానికి బసవతారకం ఆసుపత్రి ఎప్పుడూ ముందుంటుందని, గ్రామీణ ప్రాంతాల్లోనూ దీనిపై అవగాహన కల్పించాలన్నారు. నటి సంయుక్త మీనన్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌కు నాణ్యమైన చికిత్స అందుబాటులోకి వచ్చిందని, అయితే ప్రజల్లో కూడా క్యాన్సర్‌పై అవగాహన పెరగాలన్నారు. నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. తనతండ్రి క్యాన్సర్‌తో మరణించారని, వ్యాధి వచ్చిన తరువాత పోరాటడం కన్నా రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యమన్నారు. ఆసుపత్రి సీఈఓ డా. కె.కృష్ణయ్య, మెడికల్ డైరెక్టర్ డా. టీఎస్‌రావు, మెడికల్ డైరెక్టర్, సూపరింటెండెంట్ డా.ఫణికోటేశ్వరరావు, రొమ్ము క్యాన్సర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు.

వీ ఫర్ ఉమెన్ సంస్థ ఆధ్వర్యంలో..

క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని గ్రంథాలయ శాఖ చైర్మన్ ప్రొఫెసర్ రియాజ్ అన్నారు. వీ ఫర్ ఉమెన్ సొసైటీ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కోసం ఆదివారం కేబీఆర్ పార్కు వద్ద వాక్ నిర్వహించారు. వీ ఫర్ ఉమెన్ సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ ప్రతిభా లక్ష్మి మాట్లాడుతూ.. ఇరవై ఏళ్లు దాటిన మహిళలు తమ రొమ్ములను పరిశీలించుకోవాలని సూచించారు. నలభై సంవత్సరాలు దాటిన స్త్రీలు మామ్మోగ్రామ్ పరీక్ష చేయించుకుంటే రొమ్ము కాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించవచ్చన్నారు.

ముగిసిన స్వదేశీ మేళా

- చివరిరోజు సందర్శించిన మంత్రి జూపల్లి



ఓ స్టాల్‌లో వస్తువులను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఖైరతాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో పీవీ మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళా ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపారమైన చారిత్రక వైభవాన్ని, ఘనమైన సాంస్కృతిక వైవిధ్యాన్ని కలిగిన హైదరాబాద్ స్వదేశీ మేళాకు వేదికగా నిలవడం గర్వకారణమన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. తెలంగాణకు వచ్చిన అతిథులకు తమవంతు సహకారం అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మేళాలో ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రి జూపల్లి సందర్శించారు. స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్‌బాబు, భారత్ అభియాన్ ప్రాంత కన్వీనర్ జి.రమేష్ గౌడ్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేన్‌రెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ కో కన్వీనర్లు సిద్దుల అశోక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల నేతలకు రాజకీయ సన్యాసమే

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఘాటు వ్యాఖ్యలు
- సొంత పార్టీ నేతలపైనా పరోక్ష విమర్శలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

పంజాగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీల ఓట్లు బీసీలకే వేసుకుని భవిష్యత్తులో రాజ్యాధికారం సాధిద్దామని, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. రాష్ట్రంలోని అగ్రవర్ణాల నేతలంతా త్వరలో రాజకీయ సన్యాసం తీసుకోవాల్సిందేనన్నారు. బీసీ సమాజ్, బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శాంత లక్ష్మి ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకుడు రవికుమార్‌ప్రజాపతి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. 2028లో ఎక్కువ మంది బీసీలు అసెంబ్లీకి వెళ్తారన్నారు. బీసీలలో వచ్చిన ఐక్యతతో భవిష్యత్తులో అధికారం దిశగా అడుగులు వేస్తామన్నారు. రెడ్ల ఓట్లు తమకు అవసరం లేదని.. బీసీల ఓట్లు మీకు అవసరం లేదని చెప్పే ధైర్యం అని పరోక్షంగా కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. గతంలో మాజీ మంత్రి దేవేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ స్థాపించిన పార్టీలు ఎందుకు విఫలమయ్యాయో తాను తెలుసుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్, జాతీయ ఎంబీసీ, డీఎన్‌టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంగారు నర్సింహ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన కళలను భావితరాలకు అందించాలి

- సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ



కూచిపూడి నాట్య శిక్షణశిబిరాన్ని ప్రారంభించిన మామిడి హరికృష్ణ

బంజారాహిల్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మన కళలు ప్రాచీనమైనవని, మన సంస్కృతి, కళలను భావితరాలకు అందించాలని రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. అమీర్‌పేట కమ్మ సంఘంలో ఆదివారం భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్, తెలంగాణ భాష, సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నాట్యమార్గంలో పేరిట 30రోజుల సైద్ధాంతిక కూచిపూడి నాట్య శిక్షణ శిబిరాన్ని మామిడి హరికృష్ణ ప్రారంభించారు. కూచిపూడి నృత్య కళలోని విశేషాలను వివరిస్తూ శిక్షణ ఇస్తామని నాట్య గురువులు కోకా విజయలక్ష్మి, జి.రవి కూచిపూడి, మధుమతి కులకర్ణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ డాక్టర్ సంగనబట్ల నరసయ్య, డాక్టర్ కె.సూర్య, ఎం.మణిమాల పాల్గొన్నారు.

మహిళకు వేధింపులు.. కేసు నమోదు

పంజాగుట్ట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మెడికల్ హెల్త్ కేర్ సర్వీసెస్‌లో పనిచేస్తున్న మహిళపై వేధింపులకు పాల్పడుతున్న సంస్థ మేనేజర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్‌కు చెందిన ఓ మహిళకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భర్త చనిపోవడంతో కొంతకాలం క్రితం ఉపాధి కోసం నగరానికి వచ్చి పంజాగుట్టలో ఉన్న ఓ హెల్త్ కేర్ సర్వీసెస్‌లో పనిచేస్తోంది. అదే సంస్థలో హౌస్ కీపింగ్ విభాగంలో పనిచేసున్న మేనేజర్ సురేష్‌తో పరిచయం కావడంతో వారిద్దరూ కొంతకాలం కలిసున్నారు. ఆ తార్వత వెళ్లిపోయిన ఆమె మళ్లీ అతడి వద్దకు వచ్చి వివాహం చేసుకోవాలని కోరడంతో వేధించడం ప్రారంభించాడు. దీంతో ఆమె తనను సురేష్ మోసం చేశాడని పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

ఎర్రగడ్డ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్యానికి ఆయుర్వేదం మూలమని ఎర్రగడ్డ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యశోద పెనుబాల అన్నారు. ధన్వంతరి జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ఆయుర్వేద వైద్యంపై అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 29న జరగనున్న ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధన్వంతరి జయంతిని ఆయుర్వేద దినోత్సవంగా వేడుకలు జరుపుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మమత కస్తూరి, లక్ష్మి ప్రభాకర్, ఉమాశ్రీనివాస్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆటోడ్రైవర్ మృతి

కవాడిగూడ: గుండెపోటుతో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బోయిన్‌పల్లిలో నివాసం ఉండే కె కిరణ్‌కుమార్(34) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. అతడికి భార్య కె రజిత, ఒక కుమార్తె ఉన్నారు. గత సంవత్సరంలో కిరణ్‌కుమార్ కాలును తొలగించారు. అప్పటినుంచి డిప్రెషన్‌లోకి వెళ్లి మద్యానికి అలవాటు పడ్డాడు. ఆదివారం మధ్యాహ్నం గాంధీనగర్ పీఎస్ పరిధిలోని జీరా ప్రాంతంలో పడిపోయి ఉన్నాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గమనించారు. కిరణ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5 దుర్గా భవానీనగర్‌లో దీపావళిని పురస్కరించుకొని మహిళలకు చీరలను అందజేస్తున్న బస్తీ అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి జానీ నాయక్ తదితరులు

- బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)



ప్రధాని మోదీ మన్‌కి బాత్‌ను కార్యకర్తలతో కలిసి వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- బంజారాహిల్స్, (ఆంధ్రజ్యోతి)



యూసుఫ్‌గూడ డివిజన్ నాలా రోడ్డులో సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, తాత రవి, కాత్రాజ్, సాయికుమార్ తదితరులు.

- యూసుఫ్‌గూడ, (ఆంధ్రజ్యోతి)

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మెట్రోస్టేషన్ వద్ద చనిపోయి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు గాంధీనగర్ సీఐ రాజు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 60140లో లేదా గాంధీనగర్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు.

మూడేళ్ల పాపను కిడ్నాప్ చేసిన యువకుడు

- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మధీన, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల పసిపాపను కిడ్నాప్ చేసిన యువకుడిని బండ్లగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. అల్ జుబేల్ కాలనీకి చెందిన సాజిదాబేగం కుమార్తె ఫాతిమా(3) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన సొహైల్(25) తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పాప కనిపించకపోవడంతో తల్లి, కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికారు. వారు వెతుకుతున్న క్రమంలో కొద్దిదూరంలో సొహైల్ ఆ పాపను తీసుకుని నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతడి చేతి నుంచి పాపను తీసుకున్నారు. సమాచారమందుకున్న బండ్లగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా యువకుడు మాత్రం పాపను వాళ్ల కుటుంబసభ్యులకు అప్పగించడానికి వారి ఇంటికి తీసుకెళ్తున్నానని, కిడ్నాప్ కాదని చెబుతున్నాడు. పాప కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం ఆ యువకుడు కావాలనే పాపను కిడ్నాప్ చేశాడా? లేక కుటుంబసభ్యులకు అప్పగించడానికి తీసుకెళ్తున్నాడా? అతడి ఉద్దేశ్యం ఏమై ఉంటుంది అనేది నిర్ధారణ అవుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సదర్ సమ్మేళన కార్యక్రమంలో ఎర్రగడ్డ డివిజన్ యాదవ సంఘం నాయకులు ఏ.యాదగిరి యాదవ్, కె.లాలు ప్రసాద్ యాదవ్, కె.యాదయ్య యాదవ్ పాల్గొన్నారు.

- ఎర్రగడ్డ, (ఆంధ్రజ్యోతి)



సదర్ సమ్మేళనం కార్యక్రమానికి హాజరైన కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు మహమ్మద్ మోహన్ ఖురేషి, దూడల రవిగౌడ్, ఎర్ర కృష్ణ కుమార్

- ఎర్రగడ్డ, (ఆంధ్రజ్యోతి)

ఓబీసీ ఉద్యోగులకు అన్నిరంగాల్లో అన్యాయం

- మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఓబీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతుందని, జాతీయస్థాయిలో బలమైన ఉద్యమం చేపట్టి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్‌లు కల్పించాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిల నియామకాల్లో రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రస్తుత 47 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు 2 వేల కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారని, ఈ బడ్జెట్‌ను 2 లక్షల కోట్ల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలలోని ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ సర్కిల్ ప్రెసిడెంట్ కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.శివకుమార్, నాయకులు ధర్మరాజ్, విజయ్‌కుమార్, శివకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదయ్యనగర్ కమ్యూనిటీ హాల్‌లో శిబిరం

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

● కార్పొరేటర్ కొంతం దీపిక

రెజిమెంటల్ బజార్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక అన్నారు. ఆదివారం ఆదయ్యనగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్యుల దగ్గరకు వెళ్లాలంటే కన్సల్టేషన్ ఫీజు ఎక్కువ ఉండటంతో పాటు ఆస్పత్రులు కమర్షియల్‌గా మారడంతో పేదలకు భారంగా మారిందని అన్నారు. ఉచిత వైద్య శిబిరాలలో వైద్య పరీక్షలు చేసుకుని ఆరోగ్య సమస్యలుంటే చికిత్స చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 188 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంతం నరేష్, సర్వేష్, నవీన్, విశాల్, ప్రియాంక, సత్యం, చందర్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల పసిపాపను కిడ్నాప్ చేసిన యువకుడు

● అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న పోలీసులు

మదీన, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మూడేళ్ల పసిపాపను కిడ్నాప్ చేసిన యువకుడిని బండ్లగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు. అల్ జుబెల్ కాలనీకి చెందిన సాజిదాబేగం కుమార్తె ఫాతిమా(3) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా అదే ప్రాంతానికి చెందిన సొహైల్(25) తీసుకొని వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పాప కనిపించక పోవడంతో తల్లి, కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికారు. వారు వెతుకుతున్న క్రమంలో కొద్ది దూరంలో సొహైల్ ఆ పాపను తీసుకుని నడుచుకుంటూ వెళ్తున్నాడు. అతడి చేతి నుంచి పాపను తీసుకున్నారు. సమాచారమందుకున్న బండ్లగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా యువకుడు మాత్రం పాపను వాళ్ల కుటుంబసభ్యులకు అప్పగించడానికి వారి ఇంటికి తీసుకెళ్తున్నానని, కిడ్నాప్ కాదని చెబుతున్నాడు. పాప కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలను పరిశీలించిన అనంతరం ఆ యువకుడు కావాలనే పాపను కిడ్నాప్ చేశాడా? లేక కుటుంబసభ్యులకు అప్పగించడానికి తీసుకెళ్తున్నాడా? అతడి ఉద్దేశ్యం ఏమై ఉంటుంది అనేది నిర్ధారణ అవుతుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గుండెపోటుతో కార్మికురాలు మృతి

జవహర్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని మేయర్ శాంతి కోటేశ్‌గౌడ్, డిప్యూటీమేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సుగుణమ్మ(58) గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతిచెందారు.

19 వేల పుస్తకాలు..

14 దిన పత్రికలు

● అన్నిరకాల గ్రంథాలకూ నిలయం బోయిగూడ గ్రంథాలయం
● అందుబాటులో అన్నిరకాల పుస్తకాలు, దిన, వార పత్రికలు



గ్రంథాలయంలోని పుస్తకాలు, గ్రంథాలు



బోయిగూడ గ్రంథాలయ భవనం

పద్మారావునగర్, అక్టోబరు 27,(ఆంధ్రజ్యోతి): చారిత్రక, ఆధ్యాత్మిక, విజ్ఞానం, చిత్ర రంగం, కళలు, కళాకారులు, క్రీడాకారులు, శాస్త్రవేత్తలు, రాజకీయం వంటి అనేక రంగాలకు చెందిన ప్రముఖుల జీవిత చరిత్రలతో కూడిన మనకు తెలియని విషయాలు ఎన్నో పుస్తక పఠనం ద్వారా విపులంగా తెలుసుకొనే వీలుంటుంది. అలాంటి అన్ని రకాలైన పుస్తకాలు, గ్రంథాలు అందుబాటులో ఉండే భాండాగారమే గ్రంథాలయం.

ఎన్నో ఏళ్ల క్రితమే సామాన్య ప్రజానీకంతో పాటు ముఖ్యంగా విద్యార్థుల సౌకర్యార్థం ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం నగరంలోని అనేక ప్రాంతాలలో గ్రంథాలయాలను నెలకొల్పింది. అందులో భాగంగానే బన్సీలాల్‌పేట్, న్యూబోయిగూడలో 1967 లో హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శాఖా గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అలా కొనసాగుతున్న గ్రంథాలయంలో సరైన సౌకర్యాలు లేక గుర్తించిన ప్రభుత్వం మరమ్మతులు చేసింది. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరడంతో, స్థానికుల కోరిక మేరకు గత ప్రభుత్వ హయాంలో రూ.7.60 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపట్టి తిరిగి 2019లో పునఃప్రారంభించారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

ఈ గ్రంథాలయంలో గ్రంథపాలకురాలిగా విధులను నిర్వహిస్తున్న శాలిని వివరాలను తెలియజేస్తూ... నవలలు, ఆధ్యాత్మిక, చారిత్రక, రాజకీయ, సినీరంగం, చిన్నపిల్లల పుస్తకాలతో పాటుగా విద్యార్థులకు, నిరుద్యోగులకు గ్రూప్స్, పోలీస్, టీటీసీ, ఆర్ఆర్‌బీ, డాక్టర్స్ ఐపీఎస్ వంటి అనేక పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి అవసరమైన అన్ని రకాల జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తెలుగు, ఆంగ్లము, హిందీ, ఉర్దూ, మరాఠీతో కలిపి దాదాపు 19,076 పుస్తకాలు, గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటుగా 7 తెలుగు, 5 ఆంగ్లం, 1 ఉర్దూ, 1 హిందీ దినపత్రికలు, స్వాతి, ఇండియా టుడే, విజేత కాంపిటీషన్ వంటి పత్రికలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

సభ్యత్వం: వివరాలు నమోదు చేసుకొని ఆధార్ కార్డు కాపీతో రూ.100 రుసుము చెల్లించి, జీవితకాల గ్రంథాలయ సభ్యునిగా చేరవచ్చని, దాంతో అవసరమైన పుస్తకాలను చదువుకోవటానికి ఇంటికి తీసుకువెళ్లే సదుపాయం సభ్యులకు ఉంది. సభ్యులు గ్రంథాలయంలో అందుబాటులో లేని అవసరమైన పుస్తకాలను తెప్పించుకొనే సదుపాయాన్ని సైతం కల్పించడం గమనార్హం. ఇప్పటికే 564 మంది జీవితకాల సభ్యులుగా కొనసాగుతున్నారు.

పుస్తక పఠనం నా హాబీ



దాదాపు 20 ఏళ్ల నుంచి గ్రంథాలయానికి రావడం నా అలవాటు. దిన పత్రికలు, మాగజైన్స్‌తో పాటు కొన్ని ఆధ్యాత్మిక పుస్తకాలను చదువుతా. పుస్తక పఠనం నా హాబీ. న్యూబోయగూడ లైబ్రెరీ నా ఇంటి నుండి చాలా దూరం అయినప్పటికీ కొంత కాలక్షేపంతో పాటుగా సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొనే వీలుంటుంది.

- జే.శంకరయ్య, చాచా నెహ్రూనగర్

దినపత్రికతోనే నా దినచర్య



ఉదయం లేవగానే పలు దినపత్రికలను చదవడంతోనే నా దినచర్య మొదలవుతుంది. గత 30 సంవత్సరాలుగా లైబ్రరీకి వచ్చి వివిధ దిన, వార, పక్ష పత్రికలను చదువుతున్నా. నిత్యం లైబ్రెరీకి రావడం అలవాటుగా మారింది. దిన పత్రికలు చదవడం ద్వారా సమాజంలో జరుగుతున్న విషయాలను తెలుసుకొనే వీలుకలుగుతుంది. నేటి యువతలో పుస్తక పఠనంపై ఆసక్తి సన్నగిల్లింది.

- జే.సత్యనారాయణ, న్యూబోయిగూడ

సద్వినియోగం చేసుకోవాలి



అందరికీ అందుబాటులో ఉన్న బోయగుడా శాఖా గ్రంథాలయాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. వివిధ భాషల దిన పత్రికలు, వార,పక్ష పత్రికలతో పాటుగా అందరికీ ఉపయోగపడే అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు, నిరుద్యోగులకు అవసరమైన అన్ని పుస్తకాలు లైబ్రెరీలో ఉన్నాయి.గ్రంథాలయంలో సభ్యులుగా చేరినవారు పుస్తకాలను ఇంటికి తీసుకొని వెళ్లి చదివిన తర్వాత వాపసు చేసే వెసులుబాటు ఉంది.

- జి.శాలిని, గ్రంథపాలకురాలు



బస్తీబాటలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సభ్యుడు రామకృష్ణ

బీజేపీతోనే ప్రజా సమస్యలు పరిష్కారం: రామకృష్ణ

సికింద్రాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. కంటోన్మెంట్ 3వ వార్డులోని మడ్‌ఫోర్టులో ఆదివారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుకు కృషిచేస్తానని, అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బి.ఎస్.శ్రీనివాస్, అరుణ్, మహేందర్, యశాన్, నరేష్, రోషన్, ఇజాజ్, రేఖ, అనురాధ, ప్రవీణ్ పాల్గొన్నారు.

గ్రామ దేవతల ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): బొడ్రాయిని ప్రతిష్ఠిస్తే మంచి జరుగుతుందని పండితుల సూచనల మేరకు గత సంవత్సరం బొడ్రాయి పండుగను జరుపుకున్నామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం బన్సీలాల్‌పేట డివిజన్ హమాలీబస్తీలో బొడ్రాయి ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్షిక పూజలకు తలసాని హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ దేవతల దీవెనలు, ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు వెంకటేషన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

బల్కంపేట మజీద్ బస్తీ అధ్యక్షుడిగా నసీరుద్దీన్ ఖాద్రీ



అమీర్‌పేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉత్కంఠ భరితంగా సాగిన బల్కంపేట మసీద్ బస్తీ నివాసితుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో సీనియర్ పాత్రికేయుడు నసీరుద్దీన్ ఖాద్రీ రెండోసారి ఎన్నికయ్యారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎన్నికలు 12 వరకు ముగిశాయి. 2 గంటలకు ప్రారంభమైన లెక్కింపు 3 గంటలకు ముగిసింది. లెక్కింపు ప్రక్రియ అనంతరం ఖాద్రీ గెలిపొందినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

మల్కాజిగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్కాజిగిరి బస్‌స్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం పోలీసులు గుర్తించారు. సుమారు 70 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సనాతన ధర్మ ప్రచారంలో భగవతార్

తిరుమలగిరిలో సనాతన ధర్మ ప్రచారం

తిరుమలగిరి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాధాక్రిష్ణ భక్త సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరిలోని బంజారా నగర్ కాలనీ సూర్య ఎన్‌క్లేవ్, అరుణ ఎన్‌క్లేవ్ కాలనీలలో సనాతన ధర్మ ప్రచారం నిర్వహించారు. నగర సంకీర్తనలో భాగంగా కాలనీలలోని పుర వీధులగుండా భజన సంకీర్తన పాటలు పాడుకుంటూ సనాతన ధర్మాచారాన్ని ప్రచారం చేశారు. భుజానికి జోలె వేసుకుని బియ్యం, పప్పు లాంటి కానుకలను స్వీకరించారు. ప్రచారంలో భాగంగా హిందూ సంస్కృతి సాంప్రదాయాలను తెలియజేశారు. బంజార నగర్ కాలనీలలో సెక్రటరీ వైపీ రావు ఇంట్లో చంద్రకుమార్ భగవతార్‌కు పాదపూజ చేశారు. సనాతన ధర్మ ప్రచారానికి ఐటీబీ కాలనీకి చెందిన అనిల్, గణేష్ తోడ్పాటును అందించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

● బీజేపీ శ్రేణులకు మేకల సారంగపాణి పిలుపు

సికింద్రాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ఇప్పటినుంచే బీజేపీ శ్రేణులు కలిసికట్టుగా శ్రమించాలని బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పిలుపునిచ్చారు. బౌద్ధనగర్ డివిజన్‌లో ఆదివారం ఇంటింటికి తిరిగి ఆయన బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మేకల సారంగపాణి మాట్లాడుతూ, బీజేపీ సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి స్పందన వస్తోందని అన్నారు. ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసంచేసిందని, రెక్కాడితేగాని డొక్కాడని పేద ప్రజలందరూ కాంగ్రెస్‌పై పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయని అన్నారు. కార్యక్రమంలో కనకట్ల హరి, రాచమల్ల కృష్ణమూర్తి, కే.నాగేశ్వర్‌రెడ్డి, మేకల కీర్తిహర్షకిరణ్, హనుమంతు ముదిరాజ్, వెంకటేష్‌యాదవ్, మనోజ్, రవియాదవ్ పాల్గొన్నారు.



బౌద్ధనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మేకల సారంగపాణి తదితరులు

నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలికి..

● బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి



బోయిన్‌పల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీస్ వ్యవస్థ యావత్ దేశంలోనే అత్యంత పటిష్టం. అంతే కాకుండా శాంతి భద్రతలను కాపాడడంలో అగ్రగామిగా ఉంది. రాత్రీపగలు తేడా లేకుండా అహర్నిశలు కష్టపడి పోలీసులు సమర్థవంతమైన సేవలందించడం ద్వారానే ప్రజలు నిర్భయంగా జీవన విధానాన్ని కొనసాగే పరిస్థితి ఉంది. సంఘ విద్రోహులను అణచివేయడంలో పోలీసులదే కీలకపాత్ర. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు ఉన్నాయి

ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు సెక్టార్లుగా ఉన్నాయి. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో ఎస్ఐ, ఓ పెట్రో కారు ఉంటుంది. ఎప్పుడు ఎలాంటి సమాచారం అందినా.. వెంటనే నిమిషాల వ్యవధిలో సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకువస్తున్నాం.

ఎక్కువ సంఖ్యలో వచ్చే కేసులు ఎలాంటివి? ఎలా పరిష్కరిస్తారు..?

కుటుంబ కలహాలు భార్యాభర్తల గొడవలు ఇలా ఎక్కువగా ఫ్యామిలీ ఇష్యూలు వస్తుంటాయి. ముందుగా ఫిర్యాదులు స్వీకరించి దర్యాప్తు చేస్తాం. ఆ తరువాత ఇరువురిని పిలిచి కౌన్సెలింగ్ చేస్తాం. మహిళలకు కౌన్సెలింగ్ కేంద్రంలో మహిళా సిబ్బందితో కౌన్సెలింగ్ చేయిస్తాం. అప్పటికి పరిష్కారం కాకపోతే బేగంపేట్ మహిళా పోలీస్‌స్టేషన్‌కు కేసును బదిలీ చేస్తాం. ఇటీవల కాలంలో చిన్న చిన్న కలహాలతో పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారు.

నేరనిరోధక చర్యలు ఎలా చేపడుతున్నారు?

నేర నిరోధక చర్యలలో భాగంగా గస్తీని పెంచడం జరిగింది. పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం తిరుగుతున్నాయి. అనుమానితులు కనిపిస్తే పోలీస్‌స్టేషన్‌కు తరలించి ప్రశ్నిస్తున్నాం. ముఖ్యంగా ఖాళీ ప్రదేశాలపైన నిఘా పెంచి అక్కడ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే ఒకసారి పీటీ కేసులు వేస్తున్నాం. కొన్ని సమస్యాత్మక ప్రాంతాలలో సీసీ కెమెరాలు అమర్చి పర్యవేక్షిస్తున్నాం.

ఎంఎంటీఎస్.. సమయపాలన తూచ్.!

● అరగంట జర్నీకి గంటన్నర పైగా ఆలస్యం
● అనౌన్స్‌మెంట్లు లేవు.. వస్తుందో, రాదో తెలియదు
● రైళ్ల కోసం ప్రయాణికుల పడిగాపులు



హైదరాబాద్ సిటీ, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటీఎస్) రైళ్లు ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. తాము ప్రయాణించాల్సిన అరగంట జర్నీకి గంటన్నరకు పైగా ఆలస్యమవుతోందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతిరోజూ జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ నుంచి ఉదయం 8.30 గంటలకు బయల్దేరే ఎంఎంటీఎస్ రైలు.. నేచర్ క్యూర్ ఆస్పత్రి రైల్వేస్టేషన్‌కు 9గంటలకు చేరుకోవాల్సి ఉండగా, 10.30 గంటల నుంచి 11గంటల మధ్య చేరుకుంటోందని చెబుతున్నారు. దీంతో నేచర్‌క్యూర్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు కార్యాలయాలకు ఆలస్యమవుతోందని వాపోతున్నారు. జామై ఉస్మానియా నుంచి ఉదయం 9.30 గంటల ఎంఎంటీఎస్ తర్వాత, సాయంత్రం 5గంటలవరకు మధ్యలో నేచర్ క్యూర్ ఆస్పత్రి వైపు ఒక్క సర్వీసు కూడా లేకపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగి చంద్రశేఖర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు తిరుగు ప్రయాణంలోనూ రాత్రి 7.10 గంటలకు వచ్చే ఎంఎంటీఎస్ తర్వాత మళ్లీ రైలెక్కాలంటే 2గంటల పాటు (9.10వరకు) స్టేషన్లోనే వేచి ఉండాల్సి వస్తుందంటున్నారు. రాత్రి 7.40 గంటలకు ఉండే సర్వీసును రైల్వే ఉన్నతాధికారులు తరచుగా రద్దు చేస్తుండడంతో ఇక్కట్లు తప్పడం లేదంటున్నారు ప్రయాణికులు.

అనౌన్స్‌మెంట్ లేక.. రైలు వస్తుందో, రాదో తెలియక

ఫలక్‌నుమా-లింగంపల్లి మార్గంలోని బేగంపేట్ రైల్వేస్టేషన్‌లో మినహా మిగిలిన రైల్వేస్టేషన్లలో అనౌన్స్‌మెంట్ వ్యవస్థలు పని చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. దీంతో పలు స్టేషన్లలో ఎంఎంటీఎస్ రైలు కోసం వేచిఉన్న ప్రయాణికులకు ఆ రైలు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని సందర్భాల్లో ఎంఎంటీఎస్ రైళ్లను అధికారులు రద్దు చేసిన విషయం తెలియక ఆయా స్టేషన్లలోనే గంటలకొద్దీ వేచి ఉంటున్నారని ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు. ఎంఎంటీఎస్ రైళ్ల సమయపాలనను స్వయంగా పర్యవేక్షిస్తానని సాక్షాత్తు దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ప్రకటించినా, పలు సర్వీసులు నత్తనడక నడుస్తుండడంపై పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో కూడా ఎంఎంటీఎస్ సర్వీసులను నడపాలని, అన్ని స్టేషన్లలో అనౌన్స్‌మెంట్ వ్యవస్థలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఓబీసీ ఉద్యోగులకు అన్నిరంగాల్లోనూ అన్యాయం

● మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

బర్కత్‌పుర, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఓబీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని, జాతీయస్థాయిలో బలమైన ఉద్యమం చేపట్టి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని ఆయన హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆలిండియా బీఎస్ఎన్ఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జాతీయ ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ భద్రత కల్పించాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని, సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీల నియామకాల్లో రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రస్తుత 47 లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు 2 వేల కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేశారని, ఈ బడ్జెట్‌ను 2 లక్షల కోట్ల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలలోని ఓబీసీ ఉద్యోగుల అసోసియేషన్లకు గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ సర్కిల్ ప్రెసిడెంట్ కె.అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.శివకుమార్, నాయకులు ధర్మరాజ్, విజయ్‌కుమార్, శివకృష్ణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇదేం రోడ్డు..!

● అంబేడ్కర్ నగర్ బస్తీ వద్ద అధ్వానంగా మారిన చౌరస్తా



అంబేడ్కర్ నగర్ బస్తీ వద్ద అధ్వానంగా మారిన చౌరస్తా

మారేడుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మోండా డివిజన్ పరిధి ఈస్ట్ మారేడుపల్లి టీచర్స్ కాలనీలోని అంబేడ్కర్ నగర్ బస్తీ వద్ద కూడలి (చౌరస్తా) రోడ్డు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఏడాదిన్నర క్రితం రూ.54 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇక్కడ నాలుగు రోడ్లు కలిసే పదిహేను మీటర్ల కూడలి (మినీ చౌరస్తా) రోడ్డును పూర్తిచేయకుండా అలాగే వదిలివేశారు. సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో స్థానికులు సైతం రోడ్డును పూర్తిగా వేయాలని సూచించినా సదరు కాంట్రాక్టర్ అలాగే వదిలివేశారు. దీంతో అంబేద్కర్ నగర్ బస్తీవాసులు, రైలు నిలయం ఉద్యోగులు, సేయింట్ జాన్స్ క్రీడా మైదానంలో శిక్షణ తీసుకునేందుకు వచ్చే క్రీడాకారులు, పార్క్‌కు వచ్చే సీనియర్ సిటిజన్స్, టీచర్స్ కాలనీలోని జీహెచ్ఎంసీ క్రీడా మైదానానికి వచ్చే క్రీడాకారులు, పాదచారులు, ప్రయాణికులు ప్రమాదకరంగా మారిన కూడలి రోడ్డుపై రాకపోకలు సాగిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అదేవిధంగా టీచర్స్ కాలనీ పార్క్, క్రీడా మైదానం చుట్టూ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్లు వేశారు. తవ్వకాలు జరిపిన చోట్ల తూ తూ మంత్రంగా మరమ్మతులు చేపట్టారు. కొద్ది వారాలకే అవి సైతం ఎగుడు... దిగుడుగా కుంగి పోయి ప్రమాదకరంగా మారాయి. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి సీసీ రోడ్డును వేసి సమస్యను పరిష్కరించాలని అంబేద్కర్ నగర్ బస్తీవాసులు డిమాండ్ చేస్తున్నారు.